## క్లుప్తంగా

### ఘనంగా మధ్యారాధన వేడుకలు



స్వామివారికి క్షీరాభిషేకం చేస్తున్న పూజారి

ఆదోని అర్బన్: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం మధ్యారాధన వేడుకలు స్థానిక మంగరాయ సన్నిధిలో ఘనంగా జరిగాయి. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో పూజారులు గురురాజ ఆచారి, అక్షయ్‌లు మంగరాయ ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం, ఫల పంచామృతాభిషేకం, తేనాభిషేకం, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పూలతో అలంకరణ, నైవేద్యం, మహామంగళ హారతితో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీసేవ, ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు.

### ఇళ్ల నిర్మాణంలో జాప్యం తగదు



ఇళ్ల నిర్మాణాల ఇటుకలను పరిశీలిస్తున్న పీడీ సిద్ధలింగమూర్తి

ఆదోని సెంట్రల్: ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం చేయడం తగదని హౌసింగ్ పీడీ సిద్ధలింగ మూర్తి తెలిపారు. శుక్రవారం జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన ఇళ్లను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ గీతావాణి, హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రవికుమార్, ఎమ్మిగనూరు డీఈ ఎస్‌వి ప్రసాద్, మంత్రాలయం డీఈ లాల్‌కృష్ణ, ఏఈలు ఉన్నారు.

### మద్యం విక్రేతల అరెస్ట్



నిందితులను చూపుతున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఆదోనిరూరల్: కౌతాళం మండలం కుంటనహాల్ సమీపంలోని ఎల్లెల్సీ వద్ద శుక్రవారం తోవి గ్రామానికి చెందిన మద్యం విక్రేతలు బోయ పరశురామ్, బోయ ఉసేనిలను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. మోటార్ సైకిళ్లపై కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. మోటారు సైకిళ్లతోపాటు 21 కర్ణాటక ఓసీ డీలక్స్ విస్కీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సోదాల్లో సెబ్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి, డీటీఎఫ్ ఎస్‌ఐ స్వామినాథన్, పీసీలు శ్రీనివాస్, రోహిన్, సుధాకర్ పాల్గొన్నారు.

### పేకాట రాయుళ్ల అరెస్ట్

- రూ.8,100 నగదు, 51 పేకముక్కలు స్వాధీనం

ఆదోనిరూరల్: మండలంలోని జాలిమంచి గ్రామం పెద్ద వంక వద్ద శుక్రవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పెద్ద తుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య తెలిపారు. పేకాట ఆడుతున్న వారిలో జాలిమంచి గ్రామానికి చెందిన నరసింహులు, బోయ ఆంజనేయ, పాండురంగ, కొండయ్య, హుసేని, పురుషోత్తం, మునిస్వామిలు ఉన్నారన్నారు. వారి వద్ద నుంచి రూ.8,100 నగదు, 51 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో ఏఎస్‌ఐ రమణ, హెడ్‌కానిస్టేబుల్ చౌదరి పాల్గొన్నారు.

### అన్నదానానికి రూ. 40 వేలు విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్య అన్నదానానికి శుక్రవారం భక్తులు రూ.40 వేలు విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌లు తెలిపారు. ఆదోని వాస్తవ్యులు కురుగోడు సాయి, నరేంద్ర కుటుంబ సభ్యులు రూ.40 వేలను ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు.

# అలసిన బతుకులకు ఆసరా

అలసిన అవ్వతాతలకు.. తోడును కోల్పోయిన మహిళలకు.. విధివంచిత బడుగులకు, అణగారిన వృత్తి కళాకారులకు.. 'వైఎస్సార్ ఆసరా' ఆదరువుగా నిలుస్తోంది. కన్నపేగులు కాదనుకున్నా.. బంధువులు వద్దనుకున్నా ఆసరా కాసింత మెతుకై నిలుస్తోంది. ఎన్నికల హామీకి కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ల అమలులో తెచ్చిన మార్పు ఎందరో పేదలకు ఆసరాగా మారింది. ఏటేటా పింఛన్ల నగదు పెంచటం, పార్టీలకు అతీతంగా కొత్త పింఛన్లు మంజూరు చేస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇంటి వద్దకే పింఛన్ తెచ్చి ఇస్తుండటంపై సంతోషం వెలిబుచ్చుతున్నారు. –మంత్రాలయం /ఆదోని అర్బన్/ రూరల్



ఈయన పేరు ఉప్పర మూకప్ప. జంపాపురం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. 8 ఏళ్ల క్రితం పక్షపాతం సోకి కాలు, చేయ పడిపోయి మంచంకు పరిమితమయ్యాడు. వారిది నిరుపేద కుటుంబం. వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. పింఛన్ కోసం రెండు సార్లు దరఖాస్తు చేసుకున్నా సదరం సర్టిఫికెట్ లేకపోవడంతో మంజూరు కాలేదు. ఈ ఏడాది వలంటీర్ ద్వారా సదరం సర్టిఫికెట్ పొంది పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం మంజూరు చేసింది.



ఈమె పేరు వడ్డే నరసమ్మ. ఆదోని మండలం సాదాపురం. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా పెళ్లిళ్లు కావడంతో వేరే ఊళ్లకు వెళ్లడంతో భర్త చిన్న ఈరన్నతో కలిసి కొట్టంలో ఉంటూ జీవనం సాగించేవారు. అయితే చిన్న ఈరన్న ఆరు నెలల క్రితం గుండెపోటుతో మరణించాడు. వలంటీర్ వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేయించడంతో ప్రభుత్వం మంజూరు చేసింది. భర్తను కోల్పోయి, ఎలా జీవించాలో తెలియని స్థితిలో ఉన్న నరసమ్మకు పింఛన్ సొమ్ము కొండంత ఆసరాగా నిలవనుంది.



బసాపురంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న మండల కన్వీనర్ భీమిరెడ్డి



ఆదోనిలో కొత్త పింఛన్‌లను తీసుకున్న వారితో ఎంపీడీఓ గీతావాణి

- నియోజకవర్గంలో 29,295కు చేరిన పింఛన్లు
- హర్షం వెలిబుచ్చుతున్న లబ్ధిదారులు

మంత్రాలయం: నియోజకవర్గంలో ఈ ఏడాది ఆగస్టు నెల వరకు 28,150 పింఛన్లు వచ్చాయి. అందుకుగానూ 7.9 కోట్ల వరకు నెలనెలా నిధులు మంజూరు చేశారు. ఈనెలలో పింఛన్లు 2 వేల వరకు పెరిగాయి. 1వ తేదీ వరకు 629 పింఛన్లను ఖరారు చేశారు. మిగిలిన పింఛన్లపై అధికారులు విచారణ చేయనున్నారు. త్వరలోనే విచారణ జరిపిన పింఛన్లను సైతం లబ్ధిదారులకు అందజేయనున్నారు.

- ఆదోని రూరల్: అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ అందజేస్తామని ఆదోని ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. మండల వ్యాప్తంగా కొత్తగా మంజూరైన 284 పింఛన్లను శుక్రవారం ఆమె తన కార్యాలయంలో పంపిణీ చేశారు. మరో 312 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు.

#### జీవితాంతం జగనే ముఖ్యమంత్రి



రేషన్‌కార్డు కర్ణాటకలో మ్యాపింగ్ కావడంతో ఐదేళ్ల నుంచి పింఛన్ కోసం దరఖాస్తు చేస్తున్నా మంజూరు కాలేదు. వలంటీర్ సమస్యను పరిష్కరించి పింఛన్‌కు దరఖాస్తు చేయించడంతో ప్రభుత్వం మంజూరు చేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మా లాంటి ప్రతి ఒక్కరికి పింఛన్లు ఇవ్వడం సంతోషం. జీవితాంతం ఆయన ముఖ్యమంత్రిగా ఉండాలి. – లక్ష్మమ్మ, వైఎస్సార్ నగర్, కౌతాళం

#### ఆనందంగా ఉంది



నా భర్త వన్నూర్ గత ఏడాది జనవరిలో మృతి చెందాడు. రేషన్ కార్డులో నా భర్త పేరు ఉండటంతో ఇన్నిరోజులు పింఛన్ రాలేదు. తొలగించుకున్నాక ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. ఈ విషయం వలంటీర్ ఇంటికి వచ్చి చెప్పడంతో చాలా సంతోషమేసింది. మాలాంటి వాళ్లకు ఇంతమేలు చేస్తున్న జగనన్నే మరోసారి ముఖ్యమంత్రి కావాలి. – రజియాబీ, వైఎస్సార్ నగర్, కౌతాళం

#### జగనన్నే మాకు దిక్కు



నా ఆధార్ కార్డులో పేరు, ఊరు సరిగా లేకపోవడంతో ఇన్ని రోజులు పింఛన్ రాలేదు. నాకు ఇద్దరు కుమారులు. నన్ను వదిలేసి వెళ్లిపోయారు. నేను, నా భర్త ఉంటున్నాం. మాలాంటి దిక్కు లేని వారికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొడుకుగా ఉండి ఆదుకుంటున్నాడు. పింఛన్ రావడం సంతోషంగా ఉంది. – జంగమ శంకరమ్మ, 34వ వార్డు, ఆదోని

#### పింఛన్ ఆసరా అవుతుంది



నా భర్త మంగలి రవి 8 నెలల క్రితం గుండె పోటుకు గురై మృతి చెందాడు. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నా భర్త చనిపోయిన తర్వాత రోజు కూలీ పనులకు వెళ్లి పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నా. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోయాక పింఛన్‌కు దరఖాస్తు చేసుకోగా ఏడాదిలోగా ప్రభుత్వం మంజూరు చేసింది. కుటుంబ పోషణకు, పిల్లల చదువుకు ఉపయోగించుకుంటాను.
– మంగలి ఈరమ్మ, కోసిగి

#### ప్రభుత్వానికి రుణ పడి ఉంటాం



నా భర్త శరణప్ప నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కొద్ది రోజులుగా వితంతు పింఛన్ వచ్చేది. అయితే నా ఆధార్ కార్డు కర్ణాటక రాష్ట్రం చెందినది కావడంతో పరిశీలనలో ఏడాది క్రితం తొలగించారు. మరోసారి వలంటీర్ ద్వారా విచారణ చేసి కొత్తగా పింఛన్ మంజూరు చేశారు. పింఛన్ సొమ్ము నాకుటుంబానికి ఆసరాగా ఉంటుంది.
– చంద్రమ్మ, కందుకూరు

#### మాలాంటోళ్లకు ఎంతో నయం



మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. కూలినాలీ చేసుకుని బతుకు సాగిస్తున్నాం. 3 నెలల క్రితం నా భర్త కాలమయ్యాడు. నా వయస్సు 60 ఏళ్లు దాటాయి. ఇంకా కూలి పనులు పోవడం కష్టంగా ఉంది. మా లాంటోళ్లకు పింఛన్ ఆసరాగా ఉంటుంది. సీఎం జగన్ బీదలపై చూపుతున్న ప్రేమ బాగుంది.
– దూదేకుల కాశింబీ, పెద్దకడబూరు

## పర్యాటక కేంద్రంగా రాంజల



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ బోయ శాంత

ఆదోనిటౌన్: రాంజల నల్లచెరువు పరిసర కొండ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్ పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పర్యాటక కేంద్రం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాట కేంద్రానికి అమృత పథకం కింద మొదట విడతగా రూ.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. అందులో మొదటి విడతగా రూ.2.43 కోట్లు విడుదలయ్యాయన్నారు. ప్రహరీ, చెట్ల చుట్టూ కట్టలు, రోప్ వే, చెరువులో బోట్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. డివిజన్ కేంద్రమైన ఆదోనిలో కాలక్షేపం, ఆధ్యాత్మికంగా పార్కుల అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాంజల చెరువు ప్రాంతం మరో ఐదారు నెలల్లో రూపురేఖలు మారిపోనున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోజ్‌రెడ్డి, వైస్ చైర్మన్‌లు నరసింహులు, గౌస్, కౌన్సిలర్లు మహ్మద్‌స్వామి, అజేశ్వరరెడ్డి, సనాఖాన్‌ఇక్బాల్, కిషోర్, బాలాజీ, రఘునాథ్‌రెడ్డి, చలపతి, చిన్నా, సింహంనాగేంద్ర, ఏఈలు రాజశేఖర్‌రెడ్డి, కృపాకర్ పాల్గొన్నారు.

## వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం



వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: జిల్లాలో క్రీడా ప్రతిభ అవార్డులకు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ పీఈటీ, ఎస్‌ఏ పీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం పురపాలక పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దకడబూరు మండల విద్యాధికారి రామమూర్తి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు చాలా మంది ఉన్నారన్నారు. వారిని ప్రోత్సహిస్తే అద్భుత ఫలితాలను సాధిస్తారన్నారు. అవార్డులు పొందిన వ్యాయమ ఉపాధ్యాయులను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. మొదటి స్థానంలో నిలిచిన వ్యాయామ ఉపాధ్యాయురాలు సృజనను, రెండవ స్థానంలో ఉపాధ్యాయురాలు సరళ, మూడవ స్థానంలో నిలిచిన ఖలీల్ అహ్మద్, నాలుగో స్థానంలో నిలిచిన చినబాబులను సత్కరించారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు ఈరన్న వెంకటేశ్, సత్యనారాయణ, సాబీర్ అహ్మద్, నరసన్న, జగనాథ్, మస్తాన్, సరోజ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయండి



సీఐలకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోనిఅర్బన్: పట్టణంలోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామికి మూడో శ్రావణమాస శనివారం సందర్భంగా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేయాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. శుక్రవారం సీఐలతో స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో శనివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వస్తారని, ఎలాంటి అవాంచయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. కొండ ప్రాంతంలో సిబ్బందిని నియమించి ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. వాహనాల పార్కింగ్ మరొకరికి ఇబ్బంది కలిగించకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో సీఐలు విక్రమసింహ, శ్రీనివాసనాయక్, నరసింహరాజు, ఎస్‌ఐ జయశేఖర్ పాల్గొన్నారు.

## వేళకు విద్యార్థి బస్సు నడపండి



డిపో మేనేజరుకు వినతి పత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆదోని సెంట్రల్: పాఠశాలలు, కళాశాలల సమయానికి విద్యార్థి బస్సు నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సమయానికి బస్సు సర్వీసులు లేకపోవడంతో తరగతులు కోల్పోతున్నామని ఇంగళదహాల్, హెబ్బటం గ్రామాల విద్యార్థులు శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ రఫీక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నాగరాజు, గౌస్, రాజు, మహేష్, దినేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**పాలిటెక్నిక్ కళాశాల వద్ద బస్సు నిలపాలి**

ఆదోని పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాల వద్ద బస్సు ఆపాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు కె.సోమశేఖర్, పగడాల రమేష్ కోరారు. శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ రఫీక్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. ఆదోని నుంచి ఆస్పరి, పత్తికొండకు వెళ్లే బస్సు సర్వీసులకు పాలిటెక్నిక్ కళాశాల వద్ద స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కిరణ్ చెన్నయ్య, బీడీఎస్‌ఎఫ్ నాయకులు యోహన్, సాయి, వెంకటేష్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకోండి

కృష్ణగిరి: ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య సూచించారు. మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి 104 ద్వారా అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో మురుగునీరు నిలిచిన ప్రాంతాలను, నీటి తొట్టెలను పరిశీలించి సిబ్బంది సూచనలు, సలహాలు ఇచ్చారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చాలా ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లకున్నా ప్రతి నెల ప్రతి గ్రామంలో రెండు రోజులు 104 వాహనం వెంట వైద్యులు వచ్చి సేవలు అందిస్తుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ముఖ్యంగా వాటర్ ట్యాంకులు, ఇళ్లలోని తొట్లను నిత్యం శుభ్రం చేసుకుంటూ బ్లీచింగ్‌పౌడర్‌ను వేసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టడంలో పంచాయతీ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. వైద్యాధికారి ప్రదీప్ ఉన్నారు.



వెంకన్న పట్టువస్త్రాలతో ఊరేగింపుగా వస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మేంద్ర



పూజ్యాయా రాఘవేంద్రయా కీర్తనకు నృత్య ప్రదర్శన

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మంత్రాలయం: రాఘవేంద్రుల మధ్యారాధన వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామి సశరీరంగా బృందావన ప్రవేశం చేసిన శుభదినం కావడంతో వేడుకలు అంగరంగా వైభవంగా జరిగాయి. అలాగే యోగీంద్ర మంటపంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తమిళనాడులోని చెన్నైకి చెందిన డాక్టర్ శోభన స్వామినాథన్ బృందం పంచవీణా సంగీత కచేరి గావించారు. వీణల నాదంతో శ్రీమఠం వీనుల విందు చేసింది. బెంగళూరుకు చెందిన రాయచూర్ శేషగిరిదాస్ దాసవాణి సంకీర్తనలు ఆధ్యాత్మికతను పంచాయి. కర్ణాటకలోని కల్బుర్గికి చెందిన ఓంకార్ నృత్య సాధన బృందం నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. కార్యక్రమంలో దాససాహిత్య ప్రాజెక్టు అధికారులు అప్పన్నాచార్, పద్మనాభరావు పాల్గొన్నారు.



వేడుకలో సినీ నటుడు జగ్గేష్



విశిష్ట అలంకరణలో రాఘవేంద్రుల మూల బృందావనం



ప్రదర్శనలు తిలకిస్తున్న భక్త జనులు

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పెద్దకడబూరు: మండల కేంద్రంలో పెద్ద లక్ష్మమ్మవ్వ దేవి నూతన ఆలయ నిర్మాణానికి శనివారం భూమిపూజ కార్యక్రమం చేపడుతున్నట్లు అమ్మవారి ఆలయ పూజారి విశ్వబ్రాహ్మణ నరసింహాచారి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం వేద పండితులచే గణపతి పూజ, మహా శాంతిహోమము, 11.30గంటలకు విదియ తులా లగ్నమందు నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

### కలిసికట్టుగా వేడుకల్ని జరుపుకుందాం

కౌతాళం: వినాయక చవితి వేడుకల్ని అందరు కలిసికట్టుగా జరుపుకుందామని సమితి సభ్యులు మారుతీమోహన్ అన్నారు. ఆదోని డివిజన్ ఇన్‌చార్జ్ కనిగిరీ నీలకంఠ, రామకృష్ణలతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈనెల 18న వినాయకుని ప్రతిష్ఠ, 20న నిమజ్జనం ఉంటుందన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా చవితి ఉత్సవాలను ఆనందంతో జరుపుకోవాలన్నారు.

### రూ.68 లక్షలతో రాజగోపుర నిర్మాణం

మద్దికెర: పెరవలి రంగనాథస్వామి దేవాలయంలో రూ.68 లక్షలతో తూర్పు, దక్షిణ రాజగోపురాలు నిర్మించనున్నట్లు దేవాలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వారు తమ కార్యాలయంలో మాట్లాడుతూ.. గోపురాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈనెల 9వ తేదీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారన్నారు. అలాగే దాతల సహకారంతో ఆలయంలో కోటి రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

### కౌలు రైతులకు పండగ

పెద్దకడబూరు: కౌలు రైతులకు పండగ రోజని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తంరెడ్డి, వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కౌలు రైతులకు రైతు భరోసా డబ్బులు విడుదల చేయడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు.

## సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మేనేజింగ్ డైరెక్టర్ దామోదర నాయుడు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ దామోదర నాయుడు సూచించారు. శుక్రవారం పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎం) ఆధ్వర్యంలో గొర్రెలు, మేకల పెంపకం దారులకు, డాక్టర్లకు గొర్రెలు మేకలు పెంపకంలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మేత విషయంలో జాగ్రతలు తీసుకోవాలని పెంపకం దారులకు సూచించారు. వేరుశెనగ, మొక్కజొన్న, జొన్న గ్రాసం అందిస్తే గొర్రెలు బలంగా తయారై పునరుత్పాదన శక్తి పెరుగుతుందన్నారు. మేత అందుబాటులో లేని సమయంలో పచ్చిమేత, ఎండుగడ్డి, ప్రభుత్వం అందించే టీఎంఆర్ దాణా వంటివి సమకూర్చుకోవాలన్నారు. గాలికుంట వ్యాధి, నట్టల నివారణ, చిటుకు వ్యాధికి ప్రభుత్వం టీకాలు వేస్తుందన్నారు. ప్రభుత్వం అందించిన క్యాలండర్ ప్రకారం టీకాలు వేస్తామన్నారు. జబ్బుల నివారణకు టీకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని, ప్రతి జీవానికి వేయించుకోవాలని సూచించారు. గొర్రెలు, మేకలు జబ్బు పడినపుడు స్వంత వైద్యానికి వెళ్లొద్దని, అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని, డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలోని గొర్రెల పెంపకం దారుల సంఘాలను జిల్లాకు 40 చొప్పున చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పెంపకందారులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం నుంచి 20 శాతం సబ్సిడీతో రుణాలు పొందాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు తీసుకుంటే గొర్రెలు, మేకలు పెంపకంలో పెట్టిన ఖర్చులను 4 శాతం వడ్డీతో ప్రభుత్వం రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ప్రతి పాడిరైతుల నుంచి గొర్రెల పెంపకం దారుల వరకు అన్ని జాగ్రతలు కుంటే లాభాలు గడించవచ్చన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.రామచంద్రయ్య, పీడీ పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

### పేదలపై భారం మోపొద్దు



సచివాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోనిరూరల్: నిత్యావసరాల ధరలు పెంచి పేదలపై భారం మోపొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఎం నాయకులు కోరారు. పట్టణంలోని కల్లుబావి, వైఎస్సార్‌నగర్, శంకర్‌నగర్, అమరావతినగర్, క్రాంతినగర్, ఎంఎం కాలనీ, ఇందిరానగర్, బోయగేరి, నిజాముద్దీన్ కాలనీ, హనుమాన్‌నగర్ ఏరియాల్లోని సచివాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని సచివాలయాల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, ముక్కన్న, పట్టణ నాయకులు వీరేష కృష్ణమూర్తి, నాగేంద్ర, శ్రీనివాసులు, నాగరాజు, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.